సాక్షి నల్లగొండ

శుక్రవారం । 1 । మార్చి । 2024



ఆదాయం రూ.18.63లక్షలు
చెర్వుగట్టు ఆలయ హుండీ ఆదాయం రూ.18.63లక్షలు వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. - 8లో



ఇద్దరు దొంగల అరెస్ట్
కార్ల అద్దాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. - 8లో



పొలంలో మొసలి ప్రత్యక్షం
త్రిపురారంలోని బెజ్జికల్ రోడ్డులో ముత్యాలమ్మ గుడి సమీపంలోని వ్యవసాయ పొలంలో మొసలి ప్రత్యక్షమైంది. - 8లో

న్యూస్‌రీల్

పోలీసు యాక్టు అమలు

నల్లగొండ క్రైం: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా శుక్రవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు పోలీసు యాక్టు-30, 30ఏ, పోలీసు యాక్టు-1961 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ చందనా దీప్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించ వద్దని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బియ్యం పంపిణీ చేయాలి

నల్లగొండ: ప్రభుత్వ చౌకధరల దుకాణాలను తెరిచి శుక్రవారం నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేయాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు డీలర్లను ఆదేశించారు. ప్రతినెలా 1వ తేదీ నుంచే పేదలకు బియ్యం పంపిణీని ప్రారంభించాలని సూచించారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని, లేకుంటే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తిమ్మాపురం పీఏసీఎస్ చైర్మన్‌గా శ్రీశైలం యాదవ్



శ్రీశైలంయాదవ్‌కు నియామక పత్రం అందజేస్తున్న డీసీఓ కిరణ్‌కుమార్

చందంపేట: నేరెడుగొమ్ము మండలం తిమ్మాపురం పీఏసీఎస్ చైర్మన్‌గా కొండ్ర శ్రీశైలం యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 13 మంది డైరెక్టర్లు ఉన్న ఈ సంఘంలో అప్పటి చైర్మన్ ముక్కమల చినబాలయ్యపై అవిశ్వాసం కోరుతూ సంతకాల చేసిన తీర్మాన కాపీని ఈనెల 7న నల్లగొండలోని జిల్లా సహకార అధికారి అందజేశారు. దీంతో గురువారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా పది మంది సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారు. అనంతరం నూతన చైర్మన్‌గా కొండ్ర శ్రీశైలంయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వీరారెడ్డి, డైరెక్టర్లు గడ్డం వెంకటయ్య, బద్రు, లింగమయ్య,సత్తిరెడ్డి, బలరాం, చంద్రమౌళి, సాయిలమ్మ, నాయకులు చిత్రియాల సొసైటీ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి, ముక్కమల వెంకటయ్య, బస్వారెడ్డి, సీఐ సురేష్, ఎస్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంకల్ప సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించే బీజేపీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల నరసింహారెడ్డి కోరారు. నల్లగొండలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర సూర్యాపేట నుంచి నకిరేకల్ మీదుగా నల్లగొండకు చేరుకుంటుందని, కార్యకర్తలు ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. బైక్ ర్యాలీ అనంతరం సాయంత్రం క్లాక్ టవర్ సెంటర్ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా యూపీ డిప్యూటీ సీఎం రాజేష్ పతాక్ హాజరవుతారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మండల వెంకన్న, అసెంబ్లీ కరీంనగర్ దాయం భూపాల్ రెడ్డి, మీడియా ఇన్‌చార్జి పెరిక ముని కుమార్, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో నిత్యపూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం జోడు సేవలను మాఢ వీధిలో ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఉపాధ్యాయ పోస్టులు 605

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డీఎస్సీకి ప్రిపేరవుతున్న అభ్యర్థులు

- 4 నుంచి ఏప్రిల్ 2 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి జిల్లాలో 1,268 ఖాళీలు
- గతంలో చేసినవారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్న విద్యాశాఖ
- పరీక్ష తేదీని త్వరలో ప్రకటించనున్న ప్రభుత్వం
- బీఈడీ, టీటీసీ అభ్యర్థుల్లో చిగురిస్తున్న ఆశలు

నల్లగొండ: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా 11,062 పోస్టుల భర్తీ చేసేందుకు కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. నల్లగొండ జిల్లాలో 605 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కానున్నాయి. తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని నిర్వహిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగానే ప్రకటించింది. అయితే డీఎస్సీ విధివిధానాలు విడుదల చేసిన ప్రభుత్వం పరీక్ష తేదీని మాత్రం త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొంది.

దరఖాస్తుల స్వీకరణ ఇలా..

ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీకి అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనుంది. అయితే మార్చి 4వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తు రుసుం వెయ్యి రూపాయలుగా నిర్ణయించారు.

గత డీఎస్సీ రద్దు

గత సంవత్సరం సెప్టెంబర్‌లో ప్రభుత్వం 5,089 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే దాన్ని రద్దు చేసిన ప్రభుత్వం కొత్తగా మరికొన్ని పోస్టులను కలుపుతూ మెగా డీఎస్సీని ప్రకటించింది. అయితే గతంలో డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరలా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2023 జూలై 1 నాటికి 18 సంవత్సరాలు నిండి 46 ఏళ్ల లోపు వారు డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొంది.

వచ్చే విద్యా సంవత్సరం నాటికి కొత్త ఉపాధ్యాయులు

వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి కొత్త ఉపాధ్యాయులను పాఠశాలలకు పంపాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించింది. ప్రభుత్వ నిబంధనల మేరకు నియామకాల ప్రక్రియను పూర్తి చేసేందుకు విద్యా శాఖ సిద్ధమైంది. ఎట్టకేలకు మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల కావడంతో టీటీసీ, బీఈడీలు పూర్తి చేసి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

కేటగిరీ వారీగా ఖాళీలు

పోస్టు	ప్రభుత్వ	ఎల్‌బీ	మొత్తం
ఎల్‌పీ హిందీ	2	12	14
ఎల్‌పీ తెలుగు	1	11	12
ఎల్‌పీ ఉర్దూ	2	-	2
పీఈటీ తెలుగు	-	3	3
పీఈటీ ఉర్దూ	1	2	3
ఎస్‌ఏ(బీఎస్)తెలుగు	2	22	24
ఎస్‌ఏ(బీఎస్)ఉర్దూ	1	-	1
ఎస్‌ఏ (ఇంగ్లిష్)	2	18	20
ఎస్‌ఏ (హిందీ)	2	7	9
ఎస్‌ఏ(ఎం)తెలుగు	1	11	12
ఎస్‌ఏ(ఫిజికల్ ఎడ్యుకేషన్)తెలుగు	-	3	3
ఎస్‌ఏ(ఫిజికల్‌సైన్స్)తెలుగు	1	1	2
ఎస్‌ఏ(ఎస్ఎస్)తెలుగు	2	36	38
ఎస్‌ఏ (తెలుగు)	2	16	18
ఎస్‌ఏ (ఉర్దూ)	1	-	1
ఎస్‌జీటీ (తెలుగు)	24	349	373
ఎస్‌జీటీ (ఉర్దూ)	8	2	10
ఎస్‌ఏ (స్పెషల్ ఎడ్యుకేషన్(టీఎం)	-	13	13
ఎస్‌జీటీస్పెషల్ ఎడ్యుకేషన్ (టీఎం)	2	45	47
	54	551	605

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల వివరాలు

కేటగిరీ	నల్లగొండ	సూర్యాపేట	యాదాద్రి
స్కూల్ అసిస్టెంట్లు	128	86	84
లాంగ్వేజ్ పండిట్లు	28	23	21
పీఈటీలు	06	05	02
ఎస్‌జీటీలు	383	224	137
ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేటర్స్	13	11	10
ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేటర్స్	47	37	23
మొత్తం	605	386	277

డీఎస్సీ నోటిఫికేషన్ వేయడం సంతోషంగా ఉంది



బీఏ, బీఈడీ చేశాను. గత సంవత్సరం డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్నాను. గతంలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 86 ఉంటే ఇప్పుడు 128కి పెరిగాయి. ఎస్‌జీటీలకైతే చాలా పోస్టులు పెరిగాయి. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది.

– జానయ్య, బసిరెడ్డిపల్లి, పెద్దవూర మండలం

తెలుగు పండిట్ పోస్టులు పెంచితే బాగుండేది



ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం శుభపరిణామం. కానీ, తెలుగు పండిట్ పోస్టులు కొన్ని పెంచితే బాగుండేది. గత డీఎస్సీలో 25 తెలుగు పండిట్ పోస్టులు ఉంటే ప్రస్తుతం కొన్ని మాత్రమే పెరిగాయి. పండిట్ అభ్యర్థులు ఎక్కువగా ఉన్నందున పోస్టులు పెంచాలి.

–సరస్వతి, దండంపల్లి, నల్లగొండ మండలం

నేటి నుంచి 'ఆర్యసమాజ్' శతాబ్ది ఉత్సవాలు



ఆర్య సమాజ మందిరంలో ముస్తాబైన వేదిక

- మూడు రోజుల పాటు కార్యక్రమాలు
- హాజరుకానున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బాబా రామ్‌దేవ్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని రామగిరి ఆర్యసమాజ మందిరం శతాబ్ది ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆర్య సమాజ్ స్థాపించి వందేళ్లు అయిన సందర్భంగా ఆర్యసమాజ స్థాపకుడు దయానంద సరస్వతీ ద్విశత జయంతి వేడుకలను వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈనెల 3వ తేదీ వరకు మూడ్రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. మొదటి రోజు 200 కుండలాలతో మహాయజ్ఞం, రెండో రోజు మహాసభలు, మూడో రోజు ముగింపు కార్యక్రమాలు ఉంటాయి. ఈ ఉత్సవాలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, యోగా గురువు రామ్ దేవ్‌బాబ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.



ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

హాలియాలో నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తిన పది మంది కౌన్సిలర్లు



ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డితో కౌన్సిలర్లు

- 12మంది కౌన్సిలర్లకు పదిమంది హాజరు
- అవిశ్వాసానికి సభ్యులంతా మద్దతు
- త్వరలోనే చైర్మన్ ఎన్నికకు తేదీని ప్రకటిస్తామని ఆర్డీఓ చెన్నయ్య వెల్లడి

హాలియా: హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్‌పై మున్సిపల్ కార్యాలయంలో ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. గురువారం ఉదయం 11.30 గంటలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య సమక్షంలో ఓటింగ్ నిర్వహించారు. హాలియా మున్సిపాలిటీలో మొత్తం 12 మంది కౌన్సిలర్లుగాను బీఆర్‌ఎస్ పార్టీ తరపున ఆరుగురు, కాంగ్రెస్ పార్టీ తరపున ఆరుగురు చొప్పున కౌన్సిలర్లు గెలుపొందారు. గతంలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ఓటుతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వెంపటి పార్వతమ్మశంకరయ్య చైర్‌పర్సన్‌గా, నల్లగొండ సుధాకర్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇందులో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు అన్నెపాక శ్రీనివాస్, ప్రసాద్‌నాయక్ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం ఎనిమిదికి చేరింది. దీంతో ఎనిమిది మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం కాపీపై సంతకాలు చేసి ఈనెల 10న జిల్లా కలెక్టర్ హరిచందనకు అందజేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఆర్డీఓ చెన్నయ్య అధ్యక్షతన అవిశ్వాసం పెట్టారు. హాలియా మున్సిపల్ కౌన్సిల్‌లో 12 మంది కౌన్సిలర్లు ఉండగా సమావేశం జరగాలంటే 8 మంది సభ్యులు హాజరుకావల్సి ఉంది. కాగా కాంగ్రెస్‌కు చెందిన ఎనిమిది మంది, బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరితో కలిపి మొత్తం 10 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫీషియో ఓటు కోసం ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి హాజరుకావడంతో ఆర్డీఓ ఎన్నిక నిర్వహించారు. ఇరు పార్టీలకు చెందిన పది మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీఓ ప్రకటించారు.

మద్దతు తెలిపిన సభ్యులు వీరే..

బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు వర్ర వెంకట్‌రెడ్డి, నల్లబోతు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీకి చెందిన చింతల చంద్రారెడ్డి, చింతల దీప్తిచంద్రారెడ్డి, యడవెల్లి అనుమపనరేందర్‌రెడ్డి, గౌనీ సుధారాణి రాజా రమేష్ యాదవ్, పిల్లి చంద్రకళ ఆంజనేయులు, తక్కెళ్లపల్లి యల్లమ్మ, అన్నెపాక శ్రీనివాస్, ప్రసాద్ నాయక్ మున్సిపల్ సమావేశానికి హాజరయ్యారు. వీరందరూ అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ సమావేశానికి హాజరు కాలేదు. అవిశ్వాసం నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు చైర్మన్ ఎన్నికకు త్వరలో తేదీని ప్రకటించనున్నట్లు వెల్లడించారు. దీంతో ఇరువై రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. అవిశ్వాసం నెగ్గడంతో ఇప్పుడు అందరి దృష్టి నూతన చైర్మన్ ఎన్నికపై పడింది. ఎవరిని నియమిస్తారన్న చర్చ మొదలైంది. అవిశ్వాస సమావేశం సందర్భంగా సీఐ రాఘవరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అధికారాల బదలాయింపు

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కీలక నిర్ణయం

- కలెక్టర్లతోపాటు ఆర్డీఓలు, తహసీల్దార్లకు బాధ్యతల అప్పగింత
- నేటి నుంచి స్పెషల్ డ్రైవ్ ప్రారంభం
- పెండింగ్‌లో 23,145 దరఖాస్తులు



నల్లగొండ: ధరణి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో కలెక్టర్లకు మాత్రమే ఉన్న అధికారాలను తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ఏ అధికారులకు బదలాయించింది. గతంలో ఉన్న పెండింగ్ ధరణి సమస్యల పరిష్కరించేందుకు శుక్రవారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు మండల, గ్రామ స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు పూనుకుంది. ఇప్పటికే కలెక్టరేట్లకు వచ్చిన పెండింగ్ దరఖాస్తులను స్పెషల్ డ్రైవ్‌లో పరిష్కరించనున్నారు.

కమిటీ నివేదిక మేరకు..

గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకొచ్చి రెవెన్యూ శాఖలో సమూలమైన మార్పులు చేసింది. ఇందులో రెవెన్యూ రికార్డుల అప్‌డేషన్‌కు అన్ని రకాల మాడ్యుల్స్‌ను పెట్టలేదు. పక్కా సర్వే నంబర్ల రైతుల భూములు ఇతర రైతుల పేరుతో పట్టా పాస్‌బుక్‌లో ఎక్కడంతో దాన్ని తొలగించే అధికారం ధరణిలో జిల్లా కలెక్టర్‌కు లేదు. సీసీఎల్ఏలో కూడా వాటి మీద ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇలాంటి సమస్యలన్నింటికీ ధరణిలో ఆప్షన్‌లు లేకపోవడంతో ఏళ్ల తరబడి భూ యజమానులు.. తహసీల్దార్లు, కలెక్టర్ల చుట్టూ తిరిగినా పరిష్కారం కాలేదు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిపై ప్రత్యేక కమిటీ వేసింది. ధరణిపై అధ్యయనం చేసినఆ కమిటీ 17 మాడ్యుల్స్ కొత్తగా ఏర్పాటు చేయాలని నివేదిక ఇచ్చింది. కమిటీ నివేదిక మేరకు ప్రభుత్వం ధరణి సమస్యల పరిష్కారానికి పూనుకుంది.

అధికారాల బదలాయింపు..

రెవెన్యూ అధికారాలను ప్రభుత్వం బదలాయించింది. గతంలో ధరణికి సంబంధించి కలెక్టర్ ఒక్కరి వద్దనే అన్ని అధికారాలు ఉండేవి. తహసీల్దార్, ఆర్డీఓలకు ఎలాంటి అధికారాలు లేవు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ధరణి స్థానంలో భూమాతను ప్రవేశ పెట్టి తిరిగి పాత పద్ధతిలోనే అధికారాలను బదలాయించింది. తహసీల్దార్లకు, ఆర్డీఓలకు, కలెక్టర్లకు, సీసీఎల్ఏలకు వారివారి స్థాయిని బట్టి భూ సమస్యల పరిష్కారానికి అధికారాలను అప్పగించింది.

9 వరకు స్పెషల్ డ్రైవ్

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కొత్తగా 17 మాడ్యుల్స్‌ను రూపొందించింది. శుక్రవారం నుంచి 9వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్‌ల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. కలెక్టర్‌కు వచ్చిన దరఖాస్తులన్నింటినీ మండలాల తహసీల్దార్లకు పంపించి మండల స్థాయిలో డీటీ, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు గ్రామాలకు వెళ్లి పరిశీలించి రిపోర్టులు ఇస్తారు. తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కారం కాకుంటే ఆర్డీఓకు పంపుతారు. అక్కడ కూడా పరిష్కారం కాకపోతే కలెక్టర్‌కు పంపుతారు. జిల్లా స్థాయిలో పరిష్కారం కాకపోతే రాష్ట్ర స్థాయిలో సీసీఎల్ఏకు పంపిస్తారు. అయితే నల్లగొండ జిల్లాలో ధరణికి సంబంధించి కలెక్టర్ పోర్టల్‌లో 23,145 పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయి. వాటన్నింటినీ పరిష్కరించేందుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

పరిశోధనలతోనే కొత్త అంశాలు వెలుగులోకి

నల్లగొండ రూరల్: విద్యార్థుల ఇష్టంతో పరిశోధనలు చేస్తేనే కొత్త అంశాలు వెలుగులోకి వస్తాయని నాగపూర్ యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ కల్పనా ప్రవీణ్ పాండే అన్నారు. గురువారం ఎంజీయూ యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించిన విద్యార్థుల పరివర్తనలో ఉన్నత విద్య పాత్ర అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో వీసీ గోపాల్ రెడ్డి, అధ్యాపకులు రమేష్, ఎంవీఎన్.రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, వసంత, శ్వేత, కృష్ణ కౌండిన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్పనా ప్రవీణ్ పాండే

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం



నల్లగొండ ఎస్ఆర్ కాలేజీలో హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

నల్లగొండ: ఇంటర్మీడియట్ పరీక్షల రెండో రోజైన గురువారం ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజీ, తెలుగు, ఉర్దూ, సంస్కృతం, హిందీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జనరల్, ఒకేషనల్ కేటగిరీల్లో మొత్తం 14,090 మంది అభ్యర్థులకు 13,651 మంది పరీక్షలు రాశారు. ఇందులో జనరల్‌లో 11,785, ఒకేషనల్‌లో 1,866 మంది పరీక్ష రాశారు. ఇందులో జనరల్‌లో 321, ఒకేషనల్ విభాగంలో 118 మందితో కలిపి మొత్తం 439 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ దస్రునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నల్లగొండలో పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రతిభా వేదిక..'యువికా'

- బాల శాస్త్రవేత్తల తయారీకి ప్రత్యేక కార్యక్రమం
- ఐదేళ్ల నుంచి ఇస్రో ఆధ్వర్యంలో కొనసాగింపు
- ఈ ఏడాదికిగాను మార్చి 20 వరకు దరఖాస్తుల ఆహ్వానం
- 9వ తరగతి విద్యార్థులు అర్హులు



నల్లగొండ: శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన అంశాలపై విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) యంగ్ సైంటిస్టు ప్రోగ్రామ్ (యువ విజ్ఞాన కార్యక్రమం-యువికా)-2024కు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అంతరిక్ష సాంకేతికత, అంతరిక్ష శాస్త్రం, అనువర్తనాలపై ప్రాథమిక జ్ఞానం అందించడమే లక్ష్యంగా 2019 నుంచి చేపడుతున్న ఈ కార్యక్రమానికి ఈ ఏడాదికి గాను గత నెల 20నుంచి 9వ తరగతి విద్యార్థినీవిద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 9వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అవకాశం ఉంది. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని విద్యాశాఖ కోరుతోంది.

దరఖాస్తులు చేసే విధానం..

అధికారిక వెబ్‌సైట్.. www.isro.gov.in లో లాగిన్ కావాలని వెబ్‌సైట్‌లోకి వెళ్లిన తదుపరి యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) ఆప్షన్ క్లిక్‌చేసి అందులో విద్యార్థికి సంబంధించిన వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులు 2024 జనవరి 1 నాటికి 9వ తరగతి చదువుతూ ఉండాలి. 8వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా 50 శాతం, ఆన్‌లైన్ క్విజ్ ప్రతిభకు, సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న వారికి 10 శాతం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ చేసిన వారికి 5 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న వారికి 15 శాతం మార్కులు కేటాయించి అనుమతినిస్తారు.

మే 13న యువ విజ్ఞాన కార్యక్రమం

ఈనెల 20వరకు దరఖాస్తులను స్వీకరించి 28న తొలి జాబితా, ఏప్రిల్ 4న రెండో జాబితాను ప్రకటిస్తారు. మే 12న ఇస్రో కేంద్రాల వద్ద వీరి రిపోర్టు చేయాల్సి ఉంటుంది. 13న యువికా నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులు బస్సులు, రైళ్ల ద్వారా వెళితే ప్రయాణ రాయితీ కల్పించడంతో పాటు భోజన వసతి, బస సౌకర్యం కూడా కల్పించనున్నారు.

కార్యక్రమం ఉద్దేశమిదే..

ఇస్రో చేపట్టిన యువ విజ్ఞాన కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరు అంతరిక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఇస్రోకు చెందిన అహ్మదాబాద్, డెహ్రాడూన్, శ్రీహరికోట, హైదరాబాద్, బెంగళూర్, షిల్లాంగ్, తిరువనంతపురంలో నిర్వహిస్తారు. ఇక్కడ విద్యార్థులకు ప్రముఖ శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చా వేదికలు, ప్రయోగశాలల సందర్శన ముఖ్యులతో సమావేశాల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. ఇక్కడ అంతరిక్ష శాస్త్రం, రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పిస్తారు.

బాల శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం



జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చూడాలి. తద్వారా విద్యార్థులు బాల శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం లభిస్తుంది.

– భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

తొమ్మిదో తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి



పిల్లలు తమ ప్రతిభను చూపేందుకు ఈ కార్యక్రమం చక్కటి వేదిక లాంటింది. తొమ్మిదో తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకుని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వనం లక్ష్మీపతి, జిల్లా సైన్స్ అధికారి, నల్లగొండ

క్లుప్తంగా

కల్యాణోత్సవంలో పాల్గొన్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్

మోతె: మండలంలోని బుర్కచర్ల గ్రామంలో గురువారం సీతారామ కల్యాణం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ మందిరంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.18,63,680

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 16 రోజుల్లో రూ.18,63,680 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ కె. మహేంద్రకుమార్, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సీనియర్ అసిస్టెంట్‌లు ఇంద్రసేనారెడ్డి, శంకర్, రవీందర్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, నర్సిరెడ్డి, రాజ్యలక్ష్మి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ కట్టలో క్షౌరకులుగా అవకాశం కల్పించాలి


ఈఓ రామకృష్ణారావుకు వినతి పత్రం ఇస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి దేవస్థానం కల్యాణ కట్టలో యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణులకు క్షౌ రకులుగా అవకాశం కల్పించాలని కోరుతూ ఈఓ రామకృష్ణారావుకు యాదాద్రి పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. గత అరవై ఏళ్లుగా కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని, పట్టణ ప్రధాన రహదారి విస్తరణలో తాము అద్దెకు తీసుకున్న మడిగెలు స్వాధీనం చేసుకొని కూల్చివేయడంతో ఉపాధి కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణం లేక గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నామని, గత ప్రభుత్వం తమకు కల్యాణ కట్టలో క్షౌ రకులుగా ఉపాధి కల్పిస్తామని చెప్పి మాట తప్పారని అన్నారు. ఈ ప్రభుత్వమైనా కల్యాణ కట్టలో క్షౌరకులుగా పనిచేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు సంగం దశరథ, పసుపునూటి మురళి, పి. ప్రశాంత్, కృష్ణస్వామి, జానకిరాములు, విజయ్‌కుమార్, సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

నేడు ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం రాక

నల్లగొండ టూటౌన్: నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న బీజేపీ విజయసంకల్ప యాత్రలో పాల్గొనేందుకు శుక్రవారం ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రిజేష్ పాఠక్ నల్లగొండకు రానున్నట్లు బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం కోదాడ, సూర్యాపేట, నల్లగొండ నియోజకవర్గాల్లో విజయసంకల్ప యాత్ర కొనసాగనుందని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి తదితరులు యాత్రలో పాల్గొంటారని తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

- నిందితుల నుంచి రూ.2.77లక్షల నగదు, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు

నల్లగొండక్రైం: పార్కింగ్ చేసిన కార్ల అద్దాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం చిన్నగూడెం గ్రామానికి చెందిన రావుల శంకర్ జనవరి 30వ తేదీన మిర్యాలగూడ మండలం అవంతీపురం సంతలో గొర్రెలను విక్రయించాడు. వాటిని అమ్మగా వచ్చిన రూ.97వేలను తన టాటా ఏస్ వాహనంలో పెట్టి అవంతీపురం మార్గంలోని ఓ హోటల్‌లోకి వెళ్లాడు. అతడు వచ్చేలోపు గుర్తుతెలియని వ్యక్తులు టాటా ఏస్ వాహనం అద్దాలు పగులగొట్టి నగదు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం మిర్యాలగూడ పరిధిలో కోదాడ–జడ్చర్ల రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు


వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు

అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకొని తనిఖీ చేయగా.. కారు అద్దాలు పగులగొట్టేందుకు ఉపయోగించే పనిముట్లు, కొంత నగదు లభించాయి. పట్టుబడిన వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా బోగోల్ మండలం కప్రాలతిప్పకు చెందిన పిట్ట మహేష్, ఆవుల రాకేష్‌గా పోలీసులు గుర్తించారు. వారిని విచారించగా కార్ల అద్దాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

అవంతీపురం సమీపంలో టాటా ఏస్ వాహనం నుంచి కూడా నగదు చోరీ చేసింది తామేనని నేరం అంగీకరించారు. నిందితుల నుంచి రూ.2.77లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులపై మిర్యాలగూడ రూరల్, టూటౌన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

వరి పొలంలో మొసలి ప్రత్యక్షం

- భయాందోళనకు గురైన రైతులు
- పట్టుకొని సాగర్ జలాశయంలో వదిలిన ఫారెస్ట్ అధికారులు


పంట పొలాల్లో ఉన్న మొసలి

త్రిపురారం: మండల కేంద్రంలోని బెజ్జికల్ రోడ్డులో ముత్యాలమ్మ గుడి సమీపంలోని కొడి పెద్దులు వరి పొలంలో మొసలి ప్రత్యక్షమైంది. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతులు వరి పొలం దెబ్బతినడంతో అనుమానం వచ్చి వెతకడంతో మొసలి కనిపించిందన్నారు. దీంతో భయాందోళకు గురైన రైతులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా.. మొసలిని పట్టుకొని


మొసలిని పట్టుకుని తీసుకెళ్తున్న ఫారెస్ట్ అధికారులు

నాగార్జునసాగర్ జలాశయంలో వదిలినట్లు ఫారెస్ట్ అధికారి ఆనంద్ తెలిపారు. అయితే బెజ్జికల్ రోడ్డులో ఉన్న త్రిపురారం చెరువులో మొసలి ఉందంటూ గత కొంతకాలంగా పశువుల కాసేందుకు వెళ్లిన రైతుల మాట్లాడుకుంటూ ఉన్నారు. అప్పట్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చెరువులో వెతికించినా మొసలి దొరకలేదు. అదే మొసలి ఇప్పుడు చెరువులో నీరు ఇంకిపోయేసరికి సమీపంలో ఉన్న వ్యవసాయ పొలంలోకి చేరిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

బీబీనగర్: మండలంలోని ముగ్దుంపల్లి గ్రామ పరిధిలో గురువారం ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల శివప్రసాద్(28) తన బైక్‌పై వెళ్తుండగా ముగ్దుంపల్లి శివారులోని రావిపహాడ్, గుర్రాలదండి వెళ్లే రోడ్డు మార్గంలోని సర్కిల్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివప్రసాద్‌కు తీవ్ర గాయాలవ్వడంతో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధి ఘట్‌కేసర్‌లోని ఆస్పత్రికి మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదు.

అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక


క్రీడాకారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాగేందర్, దాసు

నల్లగొండ టూటౌన్: ఢిల్లీలో శుక్రవారం నుంచి జరగనున్న అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు నల్లగొండ జిల్లాకు చెందిన మహేంద్రగిరి, సోని, మౌనిక, దీక్షిత ఎంపికైనట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దేశ నాగేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందికట్ల దాసు తెలిపారు. ఈ పోటీల్లో 11 దేశాల క్రీడాకారులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులను గురువారం నల్లగొండ పట్టణంలో వారు సన్మానించారు. అదేవిధంగా ఎంపికైన క్రీడాకారులకు నల్లగొండ పట్టణంలోని సీకే ఆస్పత్రి అధినేత డాక్టర్ రవిప్రకాశ్ ఆర్థికసాయం అందజేసినట్లు వారు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

హాలియా: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అనుముల మండలంలోని శ్రీనాథపురం స్టేజీ సమీపంలో 565వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలంలోని ఊట్కూర్ గ్రామానికి చెందిన నర్సింగ్ శేఖర్(36), నర్సింగ్ రాములు కలిసి బైక్‌పై బుధవారం రాత్రి కనగల్ మండలం శేరిలింగోటం వద్ద జరిగిన ఫంక్షన్‌కు వెళ్లారు. రాత్రి ఇద్దరూ స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో అనుముల మండలం శ్రీనాథపురం గ్రామ శివారులోని బీపీడీ కాలేజీ వద్దకు రాగానే 565వ నంబర్ జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను నల్లగొండ నుంచి హాలియా వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి


నర్సింగ్ శేఖర్ మృతదేహం

ఢీకొట్టడంతో ఇద్దరూ ఎగిరి రోడ్డుపై పడిపోయారు. బైక్ నడుపుతున్న శేఖర్ తలపగిలి అక్కడికక్కడే మృతిచెందగా.. వెనుక కూర్చున రాములుకి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హాలియా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన రాములును హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోదా ఆస్పత్రికి తరలించారు. శేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి అన్న పాపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

కోదాడరూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను గురువారం కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన గురుచరణ్ పాలిటెక్నికల్ చదివి కార్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. బాలకృష్ణ అలియాస్ సిద్దు డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఇద్దరూ గంజాయి మత్తుకు బానిసలై గతంలో పోలీసులకు పట్టుబడి జైలు జీవితం కూడా గడిపారు. జైలు నుంచి బయటకు వచ్చిన కొద్దిరోజుల వరకు బాగానే ఉన్నా.. ఇటీవల కోదాడ పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన అవిడి రాఘవ వద్ద గంజాయి కొనుగోలు చేసి కొంత తాగి మిగిలినది ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం గురుచరణ్, బాలకృష్ణ


పట్టుబడిన నిందితులను చూపుతున్న పోలీసులు

కలిసి రాఘవ వద్ద 250 గ్రాముల గంజాయిని రూ.2500కు కొనుగోలు చేసి కొద్దిగా తాగారు. మిగిలినది అమ్ముకునేందుకు గురువారం మేళ్లచెర్వు రోడ్డులోని ఫ్లైఓవర్ సమీపంలో గల చింతచెట్టుకింద వచ్చారు. ఈ సమాచారం పోలీసులకు తెలియడంతో పక్కా ప్రణాళికతో వారిని అదుపులోకి తీసుకొని రూ.2వేల విలువ చేసే 195 గ్రాముల గంజాయిని, ఓ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గురుచరణ్, బాలకృష్ణను రిమాండ్‌కు తరలించగా రాఘవ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కోదాడ పట్టణ ఎస్ఐ రంజిత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఎల్లారెడ్డి, సతీష్, నాగేశ్వరరావు, ఆంజనేయులు కీలకంగా వ్యవహరించినట్లు సీఐ తెలిపారు.

మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు


రాధిక

నిడమనూరు: మండలంలోని రాజన్నగూడేనికి చెందిన వేలంపల్లి రాధిక మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. 2023 ఆగస్టులో ఆమె టీజీటీ, పీజీటీ, జేఎల్ (ఇంగ్లిష్) గురుకుల పరీక్షలు రాసింది. కాగా ఆమె పీజీటీ, టీజీటీ, జూనియర్ లెక్చరర్(జేఎల్) ఉద్యోగాలకు అర్హత సాధించింది. రాధిక ప్రస్తుతం నిడమనూరు మోడల్ స్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్నారు. తన విజయంలో భర్త కలుకూరి రామయ్య ప్రోత్సాహం ఎంతో ఉందని రాధిక తెలిపారు.

చింతపల్లి మండల వాసికి..


స్వామి

చింతపల్లి: మండలంలోని సాయిరెడ్డిగూడేనికి చెందిన బొమ్మకంటి యాదయ్య, లక్ష్మమ్మ దంపతుల కుమారుడు స్వామి ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల్లో జూనియర్ లెక్చరర్, పీజీటీ సోషల్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకులు సాధించడంతో పాటు డిగ్రీ లెక్చరర్‌లో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించాడు. టీజీటీలో ఎంపికైనప్పటికి వదులుకున్నట్లు పేర్కొన్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన స్వామి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ బీఈడీ చదివాడు. స్వామి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

ఆత్మకూరు(ఎం): అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని పోసానికుంట వద్ద గురువారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన గట్టు చందు(23) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం ఇసుక పోసానికుంట వైపు బునాది గాని కాల్వ కట్ట మీదుగా వెళ్తుండగా.. ట్రాక్టర్ అదుపుతప్పి కాల్వ కిందకు బోల్తా పడింది. సమీపంలోని రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను పక్కకు తొలగించగా అప్పటికే చందు మృతిచెందాడు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

యాదాద్రీశుడి సేవలో వేం నరేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామిని సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనామూర్తుల చెంత ప్రత్యేక పూజలు చేశారు. వేం నరేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ రామకృష్ణారావు లడ్డూ ప్రసాదం అందజేశారు.


వేం నరేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు కి ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

ప్రత్యేక రోజు.. ఒక్కటైన జంటలు

నాలుగేళ్లకు ఒకసారి వచ్చే లీప్ సంవత్సరంలో ఫిబ్రవరి 29న గురువారం ఉమ్మడి జిల్లాలో కొన్ని జంటలు వివాహ బంధంలోకి అడుగుపెట్టాయి. వీరంతా నాలుగేళ్ల తర్వాత తమ మొదటి పెళ్లిరోజు చేసుకోనున్నారు. ప్రత్యేక రోజున పెళ్లి చేసుకోవడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.


అర్వపల్లి: ఒక్కటైన జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన బట్టమేకల గణేష్‌యాదవ్, గరిడేపల్లి మండలం వెల్దండకు చెందిన కావ్య


అర్వపల్లి: పెళ్లితో ఒక్కటైన జాజిరెడ్డి గూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తూర్పాటి లింగమ్మ, సూర్యాపేటకు చెందిన పర్వతం ధర్మరాజు


మద్దిరాల: మండలంలోని కుక్కడం గ్రామానికి చెందిన కోట వైష్ణవి(అనూష), మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారం గ్రామానికి చెందిన చక్రవర్తుల వరదరాజులు


మోత్కూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన క్రాంతికుమార్, నిజామాబాద్ పట్టణానికి చెందిన గాయత్రి దంపతులు


గుండాల: పెళ్లితో ఒక్కటైన మండలంలోని గంగాపురం గ్రామానికి చెందిన చంద్రగిరి అవినాష్‌కుమార్ గౌడ్, రేఖ


మునుగోడు: పెళ్లి చేసుకున్న మునుగోడు మండలంలోని కమ్మగూడేనికి చెందిన భార్గవి, నిడమనూరుకు చెందిన మనోహర్



నల్లగొండ పట్టణంలోని పోలీస్ ఆడిటోరియంలో వివాహ బంధంతో ఒక్కటైన కోమల్‌సాయి, సంధ్య


రామన్నపేట : మండల కేంద్రానికి చెందిన యోగిత(వందన), చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం గ్రామానికి చెందిన బాతరాజు మహేష్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు

'లీప్' బేబీస్..

నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గురువారం లీప్ సంవత్సరం రోజున నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలకు చెందిన పూజిత, వేణు దంపతులకు జన్మించిన కుమారుడు




కట్టంగూర్‌కు చెందిన కావేరి, హనుమంతు దంపతుల కుమారుడు


కట్టంగూర్ మండలం పామనగుండ్లకు చెందిన శిరీష, శివకుమార్‌ల కుమార్తె


రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చిన భువనగిరి మండలం పెంచికల్‌పహాడ్‌కి చెందిన కృష్ణవేణి


మూడో కాన్పులో కుమార్తెకు జన్మనిచ్చిన భువనగిరి పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన హన్మా సుల్తానా


మిర్యాలగూడ అర్బన్ : ఏరియా ఆస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన త్రిపురారం మండల కేంద్రానికి చెందిన వి. మౌనిక

వీఐపీలు వస్తే సామాన్యులను పట్టించుకోరా!

- యాదాద్రిలో భక్తుల ఆగ్రహం

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయానికి ఎవరైనా వీఐపీలు వస్తే ఆలయ అధికారులు, అర్చకులు సామాన్యులను పట్టించుకోవడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఓ వీఐపీ తన కుటుంబ సభ్యులతో గర్భాలయంలో స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందే రూ.600 టిక్కెట్ కొనుగోలు చేసి సువర్ణ పుష్పార్చన చేసేందుకు ఉత్సవమూర్తుల ముందు భక్తులు కూర్చున్నారు. భక్తులచే సువర్ణ పుష్పార్చన చేసే ఆచార్యులు గర్భాలయంలో వీఐపీ చేసే పూజల వద్దకు వెళ్లారు. దీంతో సుమారు 15 నిమిషాల పాటు భక్తులు వేచిచూడాల్సి వచ్చింది. అంతేకాకుండా గర్భాలయం నుంచి ఆ వీఐపీని భక్తుల మధ్యలో నుంచే


ఆచార్యుల కోసం వేచిచూస్తున్న భక్తులు

అధికారులు, ఆచార్యులు సువర్ణ పుష్పార్చన చేసేందుకు తీసుకురావడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఆలయ అధికారులు, ఆచార్యులు వీఐపీలకు ఇచ్చిన ప్రాధాన్యత.. సామాన్యులకు ఇవ్వడం లేదని, ఈ తీరును మార్చుకోవాలని భక్తులు కోరుతున్నారు.

బోరుమన్న విజయరాఘవపురం

- రోడ్డు ప్రమాద మృతులకు ముగిసిన అంత్యక్రియలు


విజయరాఘవపురంలో నాగమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న బంధువులు, గ్రామస్తులు


కందుల నాగమ్మ (ఫైల్)


కందుల గుర్వయ్య (ఫైల్)

మునగాల: సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రం శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురి అంత్యక్రియలు గురువారం వారి స్వగ్రామాలైన విజయరాఘవపురం, రేపాలలో నిర్వహించారు. ఈ ప్రమాదంలో విజయరాఘవపురం గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు, ఓ పురుషుడు మృతిచెందిన విషయం విదితమే. వీరిలో ఇద్దరి అంత్యక్రియలు బుధవారం రాత్రే నిర్వహించారు. మరో ఇద్దరి అంత్యక్రియలు గురువారం విజయరాఘవపురంలో.. మరో మహిళ అంత్యక్రియలు రేపాలలో నిర్వహించారు. ఒకే రోజు గ్రామానికి చెందిన నలుగురు మృత్యువాత పడిన ఘటనను జీర్ణించుకోలేక విజయరాఘవపురం గ్రామస్తులు బోరున విలపించారు. అదే విధంగా ఈ ప్రమాదంలో గాయపడిన విజయరాఘవపురం గ్రామానికి చెందిన ఐదుగురు సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రేపాల గ్రామానికి చెందిన ఓ మహిళ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది.

మృత్యువులోనూ వీడని బంధం

మునగాల మండలంలోని విజయరాఘవపురం గ్రామానికి చెందిన కందుల గుర్వయ్య(65), అతడి భార్య కందుల నాగమ్మ(60) మృత్యువులోనూ తమ బంధం వీడలేదు. బుధవారం జరిగిన రోడ్డు వీరిద్దరు మృతిచెందారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ముగ్గురి వివాహం చేవారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో కూలీ పనులు లేకపోవడంతో గత పది రోజులుగా మోతె మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి తోటలు, పత్తి చేలల్లో కూలీ పనులు చేసేందుకు వెళ్తున్నారు. ప్రమాదంలో గుర్వయ్య భార్య నాగమ్మ ఘటనా స్థలంలోనే మృతిచెందగా.. తీవ్ర గాయాలైన గుర్వయ్యను స్థానికులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.